# ఎ పేటెంట్ ఆన్ ది సన్

ప్రపంచ వ్యాప్తంగా పరిశోధనలు మొదలయ్యాయి!

క్విక్...

క్విక్... క్విక్...!

ఓన్లీ వన్నియరయినా మిగిలిలేదు. అంతకు మించి సమయమూ లేదు. గడువూ లేదు. గమ్యమూ లేదు. గతీలేదు.గజీతగాడు గెడ్డలో పడి చచ్చిపోయినట్టు, గుడ్డు సున్నాతో గుడ్డుగుడుసుపోయి కంప్యూటర్లన్నీ చచ్చిపోనున్నాయి. మా అమెరికా ఏమవుతుంది? మా బిల్‌గేట్స్ ఏమవుతాడు? ఆయన్ని ఆదర్శంగా తీసుకొని నమ్మిబతికేస్తున్న ఇండియాలోని ఆంధ్రప్రదేశ్ ఏమవుతుంది? స్వర్ణాంధ్ర కలేమవుతుంది?

ఆరుగొడ్డులు తిన్న రాంపోతు ఒకే ఒక్క గాలివానకు కొట్టుకుపోయినట్టు, ఈ 'వై2కె' సమస్య ముందు కంప్యూటర్ రంగం కాళ్ళూచేతులూ చల్లబడిపోయి, తద్వారా ఎలక్ట్రానిక్ మీడియా మొత్తం చచ్చుపడి పోనున్నదా?

'నోఁ...!' అనుకున్నాడు ప్రొఫెసర్ కేట్.

"నోఁ! నోఁ...!" అన్నాడు ప్రొఫెసర్ గాట్. ఆ సోదర సైంటిస్టులిద్దరూ కంప్యూటర్ మీద మిలీనియంబగ్‌ని నివారించడానికి సకల ప్రయత్నాలూ చేస్తున్నారు. ఎంతచేర్చినా- ఏం తీసినా- మరేం చేసుకున్నా, 1999 తర్వాత 2000 రావడం లేదు. ఎంత ప్రయత్నించినా '.....00' దర్శనమిస్తున్నాయి. లేదూ అంటే '00'లు మాత్రమే దర్శనమిస్తున్నాయి.

'జీసస్' అనుకున్నా తెరమీద తిరుపతిగుండే కనిపిస్తోంది.

"జీరో విలువ జీరో కాదు..." ప్రొ॥ కేట్ తలగోక్కున్నాడు.

''యస్... యస్..! జీరోకి మనం వేల్యూఇవ్వాలి. అప్పుడు జీరో మనకు వేల్యూ ఇస్తుంది..'' ప్రొ॥ గాట్ గెడ్డం నలుపుకున్నాడు.

వేల్యూ చుట్టే పరిశోధనలూ, ప్రయాణాలూ' అని ఇద్దరూ అనుకున్నారు. వేల్యూ అనుకోవడం తోనే బోలెడు విషయాలు కళ్ళముందు మెదిలాయి. మెదిలిన వాటిని ఆవిష్కరిస్తూ, టేబుల్ మీద వున్న పేపర్లు రెపరెపలాడాయి.

గత నెలల్లో ఐక్యరాజ్య సమితి ఈ విషయం మీద ప్రపంచ దేశాలతో సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సమావేశానికి నూటాఇరవై దేశాల ప్రతినిధులు హాజరయ్యారు. మూడు వందల బిలియన్ డాలర్లు అంటే సుమారు పదమూడు లక్షల కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసారు. రిపోర్టులూ, రివ్యూలూ తెరమీద.. బుర్రలోనూ...!

''ఈ సున్నా'ని సాధిస్తే...''

''పేటెంట్ మనదవుతుంది...''

అప్పుడు బిల్‌గేట్స్‌నే బంట్రోతుగా వేసుకోవచ్చిని అనుకున్నారా సోదరులు. పేటెంట్ మంత్రదండంలా తోచింది. పేటెంట్ హక్కుని తలచుకొని ముగ్ధులయేరు.

విక్రమార్కుడు విస్తుపోయేలా పట్టుదలతో, పగలూ రాత్రీ ప్రయోగాలు చేసారు. ఇద్దరూ దెబ్బలాడుకోకుండానేమో ఒకటి కాదు రెండు నిండుసున్నలే వచ్చాయి, మిగిలాయి!

చూడగా, చూడగా ఆ సున్నాని సూర్యుణ్ని చూసినట్టు చూడలేకపోయారు. అలా చూడలేని కళ్ళకు ఆ రెండు సున్నాలు నిజంగానే సూర్యచంద్రుల్లా అగుపించడం, అనిపించడం జరిగింది. చంద్రుడికి ఆధారం సూర్యుడు. భూమికి ఆధారం కూడా సూర్యుడు. భూమ్మీద వుండే ప్రజలకు ఆధారం సూర్యుడు.

సూర్యుడు లేకపోతే?

వెలుగే లేదు!

చీకటి కూడా లేదు. ఎందుకంటే చీకటిని చూడ్డానికి మనమూ వుండము. మనము లేకుంటే పనుల్లేవ్... పంటల్లేవ్.... పదార్థాలులేవ్. పశుల్లేవ్.... పక్షుల్లేవ్.... క్రిమికీటకాదుల్లేవ్.... అందువల్ల అసలు సమస్త ప్రాణికోటీలేదు. కోన్‌కిస్కా కంప్యూట ర్రంగమూ లేదు.

ముఖ్యం సూర్యుడు...

మూలం సూర్యుడు...

సూర్యుడు ... సూర్యుడి మీద పేటెంట్ పొందితే?...

వెంటనే కాదు, వెనువెంటనే 'సూర్యుడి మీద పేటేంట్' అనే ఆలోచన మీద కూడా 'పేటెంట్' పొందేందుకు ఆ ఆలోచనని రికార్డ్‌చేసి రిజిస్టర్ చేసారా సైంటిస్టులు.

★ ★ ★

వైట్‌హౌస్‌లో అత్యవసర సమావేశమేర్పాటయింది. అమెరికా అధ్యక్షుడు కూడా ఈ సమావేశానికి హాజరయారు. ఇటు సైంటిస్టులూ, అటు ఆర్థిక శాస్త్రవేత్తలూ కూడా హాజరైనారు. పేటెంట్ ప్రొటక్షన్ రైట్స్ కమిటీ నుండి కూడా హాజరయారు. ఇది కీలక సమావేశంగా అప్పటికే పత్రికలూ రేడియో టీవీలూ ప్రకటించాయి.

అమెరికా మరో కొత్తచరిత్రకు శ్రీకారం చుడుతున్నట్టు- అదీ తనకాలంలో జరుగుతున్నందుకేమో బిల్‌క్లింటన్-మోనికాలుయిన్‌స్కీ కేసును ఉపసంహరించుకున్నంత ఆనందంగా వున్నారు.

అప్పటికే ఆర్థికశాస్త్రవేత్తల అంచనాలు ప్రారంభమయాయి. ఇక అణ్వాయుధాల అమ్మకం, అమ్మకం కోసం యుద్ధ వాతావరణం సృష్టించవలసిన పనిలేదు. ప్రపంచమే ఒక యుద్ధభూమి అవుతుంది. ఆయుధాలు అక్కర్లేని ఆయువుపట్టుమీద వ్యాపారం...!

అమెరికా అధ్యక్షుల అభినందనలు అందుకొని గర్వంగా చూస్తున్నారు ప్రొ॥కేట్ మరియు ప్రొ॥ గాట్ సోదరులు.

సన్‌రేస్‌ని ఉష్ణోగ్రత కొలిచి, డిగ్రీలనుబట్టి ఆయాదేశాల పరిధినిబట్టి పేటెంట్ రేటుని ఫిక్స్ చేయవచ్చని ఆర్థికశాస్త్రవేత్తలు సహాయ సైంటిస్టులు వివరిస్తున్నారు.

"సూర్యుడి మీద పేటెంటా?" అమెరికా కాంగ్రెస్‌లో ఒకరిద్దరు అభ్యంతరం లేవదీశారు.

"... అదేమిటండీ! అలాగ మాట్లాడుతారు? ఇవాళ వేపని కొత్తగా కనిపెట్టామా? లేదే?!... కాని కొత్తగా పేటెంట్ పొందామా లేదా?" అభ్యంతరం లేవదీయడం అమాయకత్వం, అజ్ఞానం అన్నట్టుగా చూసాడొక సభ్యుడు.

"వాముని కొత్తగా కనిపెట్టామా?" జవాబిచ్చిన సభ్యునికి సపోర్టుగా మరో సభ్యుడన్నాడు.

"మరి జీలకర్ర మాటేమిటి?" ఇంకో సభ్యుడు అందుకున్నాడు.

అప్పటికే హర్షం చప్పట్ల రూపంలో మోగింది. వేప, వాము, జీలకర్ర, బాసుమతి బియ్యం ఇంకా అనేక వాటి మీద పేటెంట్ ఎప్పుడు పొందిందీ, ఏయే దేశాల వాళ్ళు పొందిందీ- తారీఖులు దస్తావేజులతో సహితం వివరించారు పేటెంట్ ప్రొటెక్షన్ కమిటీవాళ్ళు.

"... అంచేత ఇప్పుడు పేటెంట్ హక్కు పొందుతూ వున్న ఏ ఒక్కటీ ఇప్పటికిప్పుడు కనిపెట్టింది కాదు. ఇది వరకూ వున్నవే. పేటెంట్ హక్కు మాత్రమే కొత్తగా ప్రకటించుకుంటాం,కుంటున్నాం.." వివరించాడు ప్రొ॥ కేట్.

అమెరికా కాంగ్రెస్‌లో నిజం ఇదని తెలిసిన సభ్యులు మరి నిలదియ్యలేకపోయారు. అదే అనువైన అవకాశంగా ప్రొ॥గాట్ వినియోగించుకున్నాడు.

"బావుల పెట్టెలోకి తొంగి చూసిన మనం, కళ్ళముందున్న సూర్యుణ్ణి చూడలేకపోయాం. నిజమే! సూర్యుణ్ణి చూడలేం. సాహసం కావాలి. ఆ సాహసమూ సత్తా అమెరికాకుంది..." హాస్యంతోనేకాదు, దేశభక్తితోనూ తొణికిస లాడింది ప్రొ॥ గాట్ గొంతు.

అమెరికా అధ్యక్షుని మొదలుకొని అపోజిషన్‌లో వున్న రిపబ్లికన్‌పార్టీ సభ్యుల వరకూ కరతాళ ధ్వనుల అభినందన చందనం రాసుకున్నారు సైంటిస్టు సోదరులు.

"ఇప్పటికే విత్తనాల మీద, పురుగుమందుల మీద మనదేశంతోపాటు చాలా దశాలు పేటెంట్ పొంది, మిగతా చిన్న కంపెనీలు సామంతులుగా పాలన ప్రారంభించాయి. వాటితో పోటీపడడం కన్నా అసలు పోటీయే లేకుండా, మరొకరికి దక్కకుండా 'సన్‌రేస్' మనదిగా పేటెంట్ పొందడమే అగ్రరాజ్యమైన మన అమెరికా పేటెంట్ రంగంలో కూడా అగ్రగామి కాగలదు. అవుతుంది".... ప్రొ॥కేట్ మరియు ప్రొ॥గాట్ మరిన్ని డిటైల్స్ ఇచ్చారు.

అమెరికా కాంగ్రెస్ సభ ఆ సోదరుల తెలివి తేటలకు అబ్బురపడింది.

అమెరికా 'మై పేటెంట్ ఆన్ సన్' అని ప్రకటించుకుంది.

★ ★ ★

అప్పు తీసుకెళ్ళడంలో అందరికంటే ముందుండీ ముందుచూపున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము అమెరికా పరిశోధనలకు అభినందనలు తెలియజేసుకుంది.

ఇండియా గవర్నమెంటు ఇదమిత్థంగా అభినందనలు తెలియజేసింది. తమ పార్లమెంటులో పేటెంట్‌బిల్లు ఆమోదించినప్పుడే ఈ అభినందనలు చేరినట్టని చెప్పి దేశమంత్రిత్వాల శాఖ పేర్కొంది.

ఇంకా అనేక దేశాలు ఆశ్చర్యం నుండి తేరుకోకముందే, అభినందనలు మాత్రం తప్పకుండా తెలియజేసుకున్నాయి. ఇది అనూహ్య విజయమని, అంతకన్నా ఆర్థిక విజయమని పేద దేశాల ప్రభుత్వ నేతలూ పేర్కొనక తప్పలేదు.

మోనికాలుయిన్‌స్కీ తన ఆరోపణలన్నీ సద్దాం హుస్సేన్ మీదకు తోసేస్తే ఎంత ఆనందం కలుగుతుందో అంత ఆనందం కలిగింది అమెరికా అధ్యక్షుడు బిల్‌క్లింటన్‌కి. సూర్యుడిపై పేటెంట్ హక్కుని ఖండించిన ఇరాక్‌కు ఇసుమంతయినా సన్‌రేస్ విడువకూడదని అధ్యక్షులవారు ఆంక్ష పెట్టారు.

సన్‌రైజ్‌ని కంట్రోలు చేయడం కోసం మళ్ళీ శాస్త్రవేత్తలు కుస్తీ పట్టారు. కంప్యూటర్లో 2000ల సమస్య, ఫిబ్రవరి నెలలో 30 రావడం సమస్య... వీటన్నిటితో అంతమంది సైంటిస్టులూ బిజీ అయిపోయారు. మరోవేపు టెర్మినెటర్ విత్తనాల్లాంటి చిన్న చిన్న సమస్యల పెద్ద పెద్ద ప్రయోగాలూ.... మొత్తానికి ఇది 'శాస్త్రజ్ఞుల సంవత్సరం' అన్నారు పత్రికాధిపతులు.

'రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా' అన్నట్లు అమెరికా తల్లచుకోవడం, వెంటనే జరిగిపోవడం అయిపోయింది. సూర్యకిరణాలు, భూమికి చేరడంలో వున్న మధ్య దూరంలో సింథటిక్ మెటల్ క్లాత్‌ని పె(క)ట్టి ఉపగ్రహాల ద్వారా దాన్ని వేలాడదీశారు. శీతోష్ణస్థితి చూసుకున్నారు. సూర్యునికి అడ్డంగా చంద్రుడూ, భూమీ ఇతర గ్రహాలూ రావడంవల్ల రోజులో సగభాగం ఉష్ణోగ్రత లే(రా)కుండా వుంటుంది. ఆ తెరచాపకు ల్యూబ్రికేషన్ సిస్టమ్ అమర్చారు. వాటర్ జేకట్స్‌ని చేరే విధంగా డిస్పోజబుల్ వాటర్ రాకెట్సుని పంపి పనివిధానం ఆగకుండా చర్యలు తీసుకున్నారు.

ఆ తెరచాప మిలియన్ చదరపు మైళ్ల పరిధిని కలిగివున్నప్పటికీ ప్రపంచానికి గుడ్డ కప్పడానికి కష్టం కలుగకుండా... ఆటంకం లేకుండా... వుండేందుకు ఉపగ్రహంతో అనుసంధానించి తెరచాప కదిలేటట్లు చేసారు.

తెరచాప నీడని కాక చీకటినే చిమ్మింది.

అమెరికా కళ్ళలో వెలుగు పొడిచింది.

పరిశోధనల ప్రయోగాలు ఫలవంత మయ్యాయి!

ఇప్పుడు ఒక రోజుకి పగలూ రాత్రీ అని రెండు లేవు. ఎప్పుడూ రాత్రే. ఏ వేళనయినా రాత్రే. ఆ సుదీర్ఘ రాత్రుల్లోనే పిల్లా పిచ్చుకా వదిలేద్దాం, చచ్చినట్టు ఆడవాళ్ళు ఒంటరిగా తిరుగుతున్నారు. 'గాంధీగారుంటే' అలా తిరుగుతున్న ఆడవాళ్ళని చూసి దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందని భావించేవారని కొంతమంది దేశభక్తులు ఫీలయారు ఇండియాలో. 'అరబ్బు కంట్రీలు ఆయిలు పంటలు పండిస్తే, అమెరికా సన్‌రైజ్ పంటని పండిస్తున్న'దని అమెరికా మంత్రిత్వశాఖ పేర్కొంది. ప్రకృతి సిద్ధమైన వనరుల్ని సాధించడంలో శాస్త్రజ్ఞులు, ఆధిపత్యంలోకి తీసుకురావడంలో ప్రభుత్వాలు తమ తమ దేశాల్ని ప్రగతిపథంలో నడిపిస్తాయనీ, అందులో భాగమే 'పేటెంట్ ఆన్ సన్' అని కూడా సమర్థించుకుంది.

★ ★ ★

పేటెంట్ హక్కుల మీద కలవరంకన్నా, ప్రపంచానికి సలపరమే ఎక్కువ పుట్టింది. దేశదేశాలు పేటెంట్‌ల కోసం పరుగులు తీసాయి. పేటెంట్ హక్కుల సాధనతోటే కొత్తశతాబ్దపు ప్రారంభమని ప్రకటించుకున్నాయి!

మూడో ప్రపంచదేశాల్లో మరీ ఇండియాలాంటి దేశాల్లో మూర్ఖపు ప్రజలు కొందరు ఎదురు తిరగడంతో, అక్కడి ప్రభుత్వం ప్రజల జీవితాల్లోకి తొంగి చూసింది. వరల్డు బేంకు టీమ్ ఇండియాలో తిరిగినట్టే, వరల్డ్ పేటెంట్ అండ్ రైట్స్ టీమ్ కూడా ప్రజల జీవితాల్లోకి తొంగి చూసింది.

''నిన్ను కన్నాం, పెంచాం, పెద్దచేసాం, విద్యా బుద్ధులు చెప్పించాం. ఉద్యోగం వెయ్యించాం. పుట్టినప్పటి మీద నీ ఒక్కడికీ రెండు లక్షల రూపాయలు ఖర్చు. ఇందులో మెటీరియల్ ఛార్జే ఎక్కువ. మరి లేబరు ఛార్జి? ఇంకా హేండిలింగ్ ఛార్జి? అదే నువ్వు పాడవకుండా హేండిల్ చేసినందుకన్న మాట. చెడు మార్గాలు పట్టిపోకుండా ఆపగలిగినందుకన్నమాట. ఇక సేల్సు టాక్స్. మంచి పార్టీని చూసి పెళ్ళి చేసినందుకు గాను ఈ ఛార్జీ. కనుక నీ మీద కట్నం ఐదులక్షలు మావి. నీ మీద పేటెంట్ హక్కు మాది...''

తల్లిదండ్రులు జమాఖర్చులు కాగితం చదివి వినిపించగా, కుర్రవాడు పేటెంట్‌ని ఆమోదిస్తున్నట్టు కిక్కురు మనలేదు.

అధ్యయనం కోసం పెళ్ళయిన కుర్రవాణ్ని వెంబడించి, అతని జీవితంలోకి తొంగి చూసింది. ''...నీ మెడలో మూడు ముళ్ళు వేసిన్నాడే, నాతో నీకు అన్ని ముడులూ పడిపోయాయి. అంచేత

భోజ్యేషు దాసి... కార్యేషు మంత్రి... శయనేషు రంభగా నడుచుకో. నీ తల్లి అలాగే, నీ తండ్రికి భార్య అయింది. నీకు తల్లయింది. నీకు భర్త తప్ప తలిదండ్రులు లేరు. వున్నావాళ్ళు వచ్చీపోయే బంధువులే. నీకు నీ యింటి పేరు కూడా లేదు. నా యింటిపేరే నీది... నువ్వు నా దానివి..." ఆ అమ్మాయి మీద అబ్బాయికి ఎంత పేటెంటు ప్రేమ వుందో అర్థమయింది అధికారగణానికి. అదే విషయం అధ్యయన పత్ర రిపోర్టులో రాసుకున్నారు.

అదే సమయంలో సోనియాగాంధీగారు తిరుపతి వెంకటేశ్వర స్వామిని దర్శించుకోబూనారు.

"వీల్లేదు, అడ్డుకుంటాం. ఆమెను రానివ్వం... ఆమె క్రిష్టియన్ హిందూ. ఆలయ ప్రవేశాన్ని అనుమతించం.." భజరంగదళ్ ప్రకటించింది. కేంద్ర రాష్ట్ర - ఏ ప్రభుత్వాలూ ఖండించలేదు. భజరంగ్‌దళ్ అలా ప్రకటించడం, శ్రీ తిరుమల తిరుపతి దేవుడైన శ్రీ వెంకటేశ్వర స్వామి పై వారికి గల పేటెంట్ హక్కుగానే అర్థం చేసుకున్నారు.

మరోపక్క శివసేన పాకిస్తాన్ టీమ్ ఇండియాలో క్రికెట్ ఆడుకోవడానికి పచ్చజెండా వూపింది. అంతకి మునుపు ఎర్రజెండా కాదు, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌తో కలిపి కాషాయజెండా ఊపింది. ముంబైలో క్రికెట్ బోర్డు కార్యాలయాన్నే పేల్చివేసి, వాళ్ళని కలకత్తా పారిపోయేలా చేసింది. ప్రభుత్వం పాకిస్తాన్ టీమ్‌కు రక్షణ కల్పిస్తామని అన్నదేగాని శివసేన అధినేత బాలథాకరేను బతిమలాడుకుందేగాని సేనల దళాలకు ఎదురుచెప్పలేదు. ఖండించలేదు. అడ్డుకోలేదు. ఈ విషయాన్ని కూడా అధ్యయనంలో హిందూ మతం పై వారివారికి గల పేటెంట్ హక్కుగానే గుర్తించి, మరీ ధృవపరచుకున్నారు.

ఇంటిలిజన్సుశాఖ మరికొన్ని వివరాలు ఇచ్చింది. 'భారతదేశంలాంటి అతి పెద్ద ప్రజాస్వామ్య దేశానికి మూలం పేటెంట్ హక్కే అంది. అధ్యయన అధికారగణం ఉలిక్కిపడి అర్థంకానట్టు చూసింది. అయితే ఇంటలిజన్సు శాఖ సమర్పించిన రిపోర్టుతో సంతృప్తిపడింది. ఒక దఫా వోటు వేయడం ద్వారా ప్రజలు తమపై తమనాయకులకు పూర్తి పేటెంట్ హక్కుని అయిదేళ్ళదాక అందిస్తారని, అందుచేతనే నాయకులు ప్రజాభీష్టంమేరకు కాక తమ తమ ఇష్టానుసారం పాలిస్తారని సారాంశంగా బోధపడింది.

అలాగే అయోధ్యలో 'మసీదు-మందిరం' గొడవలన్నీ పేటెంట్ హక్కుల గొడవలనే వరల్డ్ పేటెంట్ అండ్ రైట్స్ టీమ్ పేర్కొంది. అయోధ్యమీద పేటెంట్ రాముడిదేనని అందుకే అల్లా మీద దాడి జరిగిందని, అసలు మతకొట్లాటలు అనడం తప్పని-ఇక్కడి ప్రజలు 'దేవుడొక్కడే' అని నమ్ముతున్నా, ఈ గొడవలకి కారణం పేటెంట్ హక్కులు గతంలో చరిత్రలో నమోదు కాకపోవడమేనని భావించింది.

ఇంకా మూలాల్లోకిపోతే రాజులమధ్య యుద్ధాలూ, రాజ్యా ఆక్రమణలూ-ఇవన్నీ తమకు గల పేటెంట్ హక్కుని ప్రకటించుకోవడానికేనని-ఇప్పుడు ఆధునిక రాజ్యాలు తమ వ్యవస్థల్లో సామరస్యంగా సాధించుకుంటున్నాయనీ తెల్పింది ఆ టీమ్. తప్పనిసరి పరిస్థితుల్లో ఇరాక్ లాంటి దేశాలపై యుద్ధం చేయవలసి వస్తోంది తప్ప ప్రపంచం ప్రశాంతంగా వుందని కూడా అన్నది. కార్గిల్‌పై పేటెంట్ హక్కు పొందేందుకే భారత్-పాకిస్తాన్లు యుద్ధం చేస్తున్నాయనీ చెప్పింది. అసలు 'ఈ పేటెంట్' అనేది ఈనాటిది కాదనీ, ద్వాపరయుగంనాటిదనీ, ద్వాపరయుగంలో శ్రీరాముడు

తండ్రికోరిక మేరకు తల్లి కైకేయికి పేటెంట్ హక్కులనిచ్చి- ఆ హక్కులకు భంగం కలుగకుండా అడవులకు వెళ్ళిపోయాడని- తల్లి కైకేయి ద్వారా భరతునకు పేటెంట్ హక్కులు సంక్రమించాయని- అదే సందర్భంలో రాణి సీత మీద పేటెంట్‌ను రావణుడు కోరడంవల్లనే ఇంతయుద్ధమూ జరిగిందని..... రామాయణంలోనేకాక భారతంలోనూ కనీస పేటెంట్ హక్కుల్ని పొందలేక పాండవులకు కౌరవులతో యుద్ధం జరిగిందని- అంచేత పేటెంట్ ప్రాచీనమైందని. అంతకన్నా పవిత్రమైందని వరల్డ్ టీమ్ పేటెంట్ అండ్‌రైట్స్ మీద తన నివేదిక సమర్పించుకుంది.

వేదాల్లో కూడా పేటెంట్ హక్కుల ప్రస్తావనే వుందన్నారు. బ్రాహ్మణులను తలతో పోల్చిచెప్పడంలోనే తెలివితేటలపై వారి పేటెంట్ హక్కుని గుర్తించాలని చెపుతోందని; క్షత్రియులను భుజాలతో పోల్చడంలోనే భుజబల పరాక్రమాలపై వారికున్న పేటెంట్ హక్కుగా అంగీకరించాలని చెపుతోందని; వైశ్యులను తొడలతో పోల్చి చెప్పడంలోనే వారికి వ్యవసాయ తదితర రంగాలపై వుండే పేటెంట్ హక్కుల బలాన్ని తెలియజేస్తోందని; పాదాలతో పోల్చబడ్డ శూద్రులు పేటెంట్ హక్కులని కాపాడేవారుగా; పంచములు అస్సలు పేటెంట్ హక్కులేని వారిగా పేటెంట్ అండ్ రైట్స్ టీమ్ పేర్కొంది.

అంచేత 'పేటెంట్' అనేది అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ వుందని, ఇప్పుడు దానికి చట్టబద్ధత చేకూరిందని తీర్మానం చేసింది !

★ ★ ★

దేశాల మధ్య సమన్యాయం చూసే అంతర్జాతీయ న్యాయస్థానం పేటెంట్ బిల్లుల వివాదాలతో తలమునకలైంది.

అంతర్జాతీయ న్యాయస్థానంలో ఇండియా మీద కేసు నమోదయింది. ఇండియా తనకు చెందాలని జూనియర్ వాస్కోడిగామా కేసు పెట్టాడు. ఇండియా ఖండిస్తూ తన ప్రతినిధుల్ని పంపింది. "మా తాతగారైన వాస్కోడిగామా ఇండియాను కనిపెట్టాడు. ఇవాళ ఏ దేశమూ తాను కనిపెట్టిన, కనుగొన్న ఏ వస్తువుపై పేటెంట్ హక్కు పొందకుండా లేదు. అలాంటిది మొట్టమొదటి సారిగా ఇండియాని కనిపెట్టింది మాతాత. తాతల ఆస్తి తండ్రులకు తద్వారా మనుమలు పొందడం కూడా ఒక పేటెంట్ హక్కే. ఆస్తులు మీద వంశపారంపర్య రైట్సు గురించి తమకి విదితమే. అంచేత న్యాయంగా ఇండియా మీద పేటెంట్ హక్కు ఇప్పించి న్యాయాన్ని కాపాడండి.." జూనియర్ వాస్కోడిగామా పిటిషన్ దాఖలు చేశాడు.

అంతర్జాతీయ న్యాయస్థానం అవాక్కయి పోయింది. కేసు స్వీకరించినా, తీర్పు ఇవ్వలేదు. అమోదించడం వల్ల వచ్చే అనర్థాలను అంచనావేసారు న్యాయనిపుణులు. తమలో ఎక్కువ మందికి మాతృభూమి అయిన అమెరికా గురించి ఆందోళన కలిగింది.

అమెరికా, సెనేట్ సభ మళ్ళీ చర్చించింది. చర్చించి ఇంటలిజన్స్ వర్గాల్ని పిలిచి కొలంబస్ ఎక్కడ వున్నదీ, ఆయన సంతతి గురించి ఆరానుకోరింది! అమెరికాకు రాబోయే ఆపదని గుర్తించడానికి మంతనాలు ప్రారంభమయాయి. కొలంబస్, వాస్కోడిగామాల సంతతి తామంటే తామని అనేకమంది బయల్దేరడంతో అసలైన వాళ్ళని గుర్తించడానికి నిజనిర్ధారణ కమిటీలని

వేశారు. హక్కుదార్లని పోల్చడం కోసం సమయాన్ని తీసుకొనే నెపంతో దేశాలపై పేటెంట్ హక్కుని గురించిన తీర్పుని అంతర్జాతీయ న్యాయస్థానం వాయిదా వేసింది.

సన్‌షైన్‌ని వాడుకుంటున్నందుకుగాను మూడో ప్రపంచ దేశాలన్నింటికీ కప్పం కట్టమని తాఖీదులు జారీ చేసింది అమెరికా.

భారతదేశంలో ఎనభైశాతం మంది వ్యవసాయమ్మీద ఆధారపడడం వల్ల, సన్‌షైన్ వాడకం అత్యధికంగా వుడడం వల్ల బకాయి పెరగడంతో అమెరికా ప్రభుత్వం మరింత ఒత్తిడి తెచ్చింది. భారత ప్రభుత్వం ఆ తాఖీదుల్ని జీ.ఓ. సర్క్యులర్‌లో రిఫరెన్సు ఇస్తూ, సర్వేచేసింది. రైతులెవ్వరూ కప్పము చెల్లించలేదు.

అమెరికా ఆదేశానుసారము ఇండియా గవర్నమెంటు పోలీసుల్ని రంగంలోకి దింపింది. ఆస్తులు జప్తు చేస్తానంది. అరెస్టులూ చేసింది. రైతులు రోడ్డు మీదకు వచ్చారు ధర్నాలు రాలీలూ... కాల్పులూ... జైళ్ళూ...

అమెరికా ఆర్డర్స్ డైరెక్టుగా ఫాలో అయినా సరే పోలీసులు కార్యం నిలబెట్టుకోలేక పోయి నందుకు, సహాయంగా మరింత సైన్యాన్ని పంపింది. ఫలితం దక్కించుకోలేకపోయింది. అప్పటికే ఉపగ్రహాలోపమో ఏమయ్యిందో తెరచాప తిరగడం మానేసింది. సింథటిక్ క్లాతు కరిగిపోవడం కాదు, కాలిపోయింది. ఇది సూర్యుని తీక్షణత వల్ల కాదని-కొన్ని దేశాల తిరుగుబాటుతనంతో చేసిన నిర్వాకమని అమెరికా విశ్వసించి, తమ తమ గూఢచారుల్ని దింపి సమాచారం సేకరించింది.

సూర్యునిపై తన కంట్రోలు తప్పిపోవడంతో దేశాల్నీ, దేశాల ప్రజల్నీ కంట్రోలు చేసి, పేటెంట్ హక్కుని పునరుద్ధరించుకోవాలని అమెరికా దృఢంగా నిశ్చయించింది. ఇరాక్ మీదనేకాక, చిన్న చిన్న దేశాల మీద కూడా అణ్వాయుధాలతో దాడి చేసింది.

ఇండియా ప్రభుత్వం ప్రజల్ని కోరింది, పోరింది. లాభంలేక అమెరికా బలగాల్ని ఊరువాడ అన్నింటా వ్యవసాయక్షేత్రాల్లో దింపింది.

పేటెంట్‌గా చెల్లించాల్సిన పైకం చెల్లించలేదు సరికదా... ఏమీ కానట్టు మరేమిలేనట్టు పంటకొయ్యడం నూర్చడం చేసి, మళ్ళీ భూమి దున్ని విత్తనాలు చల్లుతున్నారు ప్రజలు. గాలి నీరులాగే వెలుతురు (సన్ రేస్) నీ వాడు కుంటున్నారు. గాలి మీద...నీటి మీద... పేటెంట్ హక్కు వుండి వుంటే సూర్యరశ్మి మీదా పేటెంటుకూ వేల్యూ వుండేదనిపించింది. గాలి, నీరూ నేల మీద పెటెంటురైట్స్ పెట్టాలని కూడా అమెరికా అనుకొంది. ప్రస్తుతం సమస్యని అధిగమించడానికి- మిగతావాటి మీద పేటెంట్ ఆలోచన వాయిదా వేసుకుంది.

సూర్యుణ్ని అయినా బంధించమనీ లేదా సూర్యకిరణాలు వాడుకొనే వాళ్ళనైనా అరెస్టు చేయమనీ, అమెరికా బంధుబలగాల్ని, శాస్త్రవేత్తలనీ కోరింది. పోలీసుఫోర్స్‌ని దింపింది.

పొలాల్లో పోలీసు మొక్కలు లేచి-కళ్ళాల్లో పోలీసుగుడారాలుగా వెలిసాయి. స్వదేశీ, విదేశీ అని లేకుండా పోలీసులంతా ఒకే జాతి అయ్యారు. అవతరించారు. ఐక్యమత్యంగా ప్రయత్నించారు.

"అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతి నాపలేరు అరెస్టులనుసాగించి ప్రజాశక్తినడ్డలేరు" నినదించి నడిచారు జనం.

నిజమే! అత్యాధునిక పరిజ్ఞానం కూడా సూర్యకాంతి నాపలేకపోయింది. ఎంతమందినని అరెస్టు చేయడం...?! ప్రభుత్వాలన్నిటికీ చెమటలు పడుతున్నాయి. ఒకరా ఇద్దరా? అందులోనూ రైతుల్ని అరెస్టుచేయడమంటే, నూటికి ఎనభై మందిని బంధించడానికి స్థలమేది? అందుకే ఎక్కడివాళ్ళని అక్కడే తన్ని తోసేస్తున్నారు.

అయినా ఆశ్చర్యం... అద్భుతం.... సూర్యుడు అందరి దగ్గరా వున్నాడు.

నీరు పట్టిన పొలంలో సూర్యుడు.

చెరువులోనే కాదు. బురద గుమ్మిలోనూ సూర్యుడు...

లేత ఆకులమీద... ఆకులమీద మంచుబిందువులమీదా సూర్యుడు తళతళ లాడుతున్నాడు.

పొద్దున్నే కొండల మాటున పొంచి వుండి, సాయంత్రానికి తుమ్మచెట్టు డొంకల్లో దాగున్న సూర్యుడు... పట్టుకు దొరకడంలేదు....

సూర్యుణ్ని చూసిన కళ్ళతో, ఎటు చూసినా కళ్ళలో సూర్యుడే... గట్టుమీద గడ్డికుప్ప మీద... పెంట మీద, పెరటిచెట్టు కొమ్మమీదా... ఇందుగలడందులేడని సందేహం వలదు.... ఎందెందు వెతక్కుండా అందందే గలడు....

పోలీసుబూట్లు అలసిపోయి చతికిలబడ్డాయి, అలా పడ్డప్పుడు చూసుకుంటే నల్లని కాలి బూట్లమీద సూర్యుడు తళ తళ మెరుస్తున్నాడు. ఆఫీసర్ల కళ్ళద్దాల మీద కూడా దుమ్ముపోసినట్టే నవ్వుతున్నాడు.

"మై పేటెంట్ ఆన్ సన్.. మై పేటెంట్ ఆన్ సన్..." అమెరికా అరుస్తూనే వుంది. అంతు చిక్కకుండా సూర్యుడు మెరుస్తూనే వున్నాడు. ఆ మెరుపు ప్రతి రైతు కళ్ళలోనూ వుంది. రెండు కళ్ళూ రెండు సూర్యబింబాల్లా వున్నాయి.

సన్ రేస్ మీద పేటెంట్ చెల్లించడానికే కాదు, ఏ సరుకుమీదా, వస్తువు మీదా మట్టి మీదా మెదడుమీదా దేనిమీదా పేటెంట్ రుసుము చెల్లించడానికి ప్రజలు సిద్ధంగా లేరని సూర్యుడు తన కిరణాల్ని పంపి సాక్ష్యాన్నీ, గొప్ప నమ్మకాన్ని కలిగిస్తున్నాడు.

అగ్రరాజ్యమైనా-అద్భుతాలు చేసినా అమెరికా కూడా సూర్యుడ్ని కళ్ళెత్తి చూడలేకపోయింది.

ఒక పేటెంట్ కథ పల్టీలు కొట్టింది!

★ ★ ★

*ప్రచురణ : ప్రజాసాహితి, సెప్టెంబరు 22*
*మరియు 'పుత్రమాన్' బెంగాలీ & హిందీ భాషల్లోకి అనువాదితం.*
*రచనాకాలం : 05 ఫిబ్రవరి 99*